క్లుప్తంగా

17 నుంచి శ్రావణమాస ఉత్సవాలు

గన్నవరం: పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో ఈ నెల 17 నుంచి సెప్టెంబరు 14వ తేదీ వరకు శ్రావణమాస ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ జాస్తి శ్రీధర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం కలశ స్థాపనతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని, 18న మొదటి శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో మాను(మహాలక్ష్మి)కి పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 25న రెండో శుక్రవారం సందర్భంగా అఖండ దీపారాధన, అమ్మవారికి గ్రామోత్సవం జరుగుతుందని తెలిపారు. సెప్టెంబర్ 1న లక్ష తులసి అర్చన, 8న గులాబీపూలతో అర్చన, 14న కలశ ఉద్వాసనతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

ఆలయంలో సహస్ర లింగార్చన



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో ఆదివారం స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఉదయం 5 గంటలకు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. అనంతరం సహస్ర లింగార్చన చేశారు. త్రయోదశి సందర్భంగా ప్రదోష కాలంలో నందీశ్వరస్వామికి అభిషేకం, అర్చన చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు గూడూరు రామలింగేశ్వరవిద్యాసాగర్ ఆధ్వర్యంలో పూజలు వైభవంగా చేశారు. కార్యక్రమంలో ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు, ఆలయ అభివృద్ధి దాత సంగా నరసింహారావు, ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.గంగాధరరావు పాల్గొన్నారు.

328 మందికి వైద్య పరీక్షలు

నున్న(విజయవాడరూరల్): నున్న చంద్రశేఖరేంద్ర స్వామిమి సరస్వతి దేవస్థానం, చినకంచిలో ఆదివారం జరిగిన ఉచిత వైద్య శిబిరంలో 328 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందచేశారు. ఎంజే నాయుడు ఆసుపత్రి ఆధ్వర్యంలో జరిగిన ఉచితమెగా వైద్య శిబిరంలో బీపీ, మధుమేహవ్యాధి, ఎముకలు అరుగుదల, నరాలు, కండరాల వ్యాధి పీడితులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. దేవస్థానం ట్రస్టీ మొక్కపాటి శర్మ ప్రారంభించిన వైద్యశిబిరంలో వైద్యులు వంశీకృష్ణ, రవితేజ, జ్యోతి, శ్రావణి, దేవస్థానం ప్రతినిధులు మురళీకృష్ణ, భాస్కరశర్మ, నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు సీఐటీయూ ఆధ్వర్యంలో ఆట.. పాట

గన్నవరం: స్వాతంత్య్ర దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 14వ తేదీ సాయంత్రం 4 గంటలకు సీఐటీయూ నేతృత్వంలో ఆట పాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ నాయకులు ఎం. ఆంజనేయులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశ రాజ్యాంగంపై పెద్ద ఎత్తున్న దాడి జరుగుతోందని పేర్కొన్నారు. స్వాతంత్య్ర, రాజ్యాంగ హక్కుల పరిరక్షణే ధ్యేయంగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అర్ధరాత్రి 12 గంటల తర్వాత జాతీయ జెండాను ఎగురవేసి రాజ్యాంగ పరిరక్షణకు ప్రతిజ్ఞ చేయనున్నట్లు తెలిపారు.

రక్తదాతకు సత్కారం



పెనమలూరు: కానూరు అశోక్ జిమ్, మాతృ హృదయ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు, జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శి తాళ్లూరి అశోక్‌ను ఆదివారం ఘనంగా సన్మానించారు. తాళ్లూరి అశోక్ వివిధ అత్యసర సమయాల్లో ఇప్పటివరకు 65 సార్లకు పైగా రక్తదానం చేశారు. పైగా తన వద్ద ఉండే క్రీడాకారులతో కూడా అత్యవసర సమయాల్లో చైతన్యపరిచి రక్తదానం చేయటానికి ప్రొత్సహించారు. ఆయన సేవలు గుర్తించిన గుంటూరు జిల్లా పొన్నూరుకు చెందిన మన పొన్నూరు బ్లెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరుమలశెట్టి ఉమాశంకర్, అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ రక్తదాతలు ప్రాణదాతలేనన్నారు. రక్తదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. బాడీ బిల్డింగ్ అసోషియేషన్ ఈదా రాజేష్ పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

కంకిపాడు: పేకాట శిబిరంపై కంకిపాడు పోలీసులు ఆదివారం దాడులు జరిపారు. మండలంలోని కందలంపాడు గ్రామంలోని బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందటంతో ఆ ప్రాంతంపై దాడి చేశారు. దాడిలో ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1550 నగదు స్వాధీనం చేసుకున్నారు. కంకిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



నా పేరు యలవర్తి మహేష్ బాబు. పునాదిపాడు జెడ్పీ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నా. పుస్తకాల్లో చూస్తూ టీచర్లు చెప్పే పాఠానికి, తెరపైకి గ్రాఫిక్స్ రూపంలో కనిపించే పాఠానికి చాలా తేడా ఉంటోంది. ఇది బాగా అర్థం అవుతోంది. ప్రతి ఒక్కటి మా కంటికి కనిపిస్తోంది. ఇది వరకూ సైన్స్ పాఠాలు ఇలా ఉంటాయని ఊహించుకునే వాళ్లం. కానీ నేడు మానవ శరీరంలోని భాగాలు, మన విశ్వం ఇలా ఉంటుందని నేరుగా చూసి తెలుసుకుంటున్నాం. చూసింది బాగా జ్ఞాపకం ఉంటుంది. ఏకాగ్రత కుదురుతోంది.



నా పేరు ఎస్.నవ వర్షిణి . పునాదిపాడు జెడ్పీ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నా. ఇప్పుడు టీచర్లు బోధిస్తున్న విధానం చాలా బాగుంది. ప్రతి పాఠం చూస్తూ, వింటూ ఉండటంతో బాగా గుర్తుంటోంది. ముఖ్యంగా గణితంలో సూత్రాలు, భౌగోళిక స్థితి, మొక్కలు, వాటి కణజాల పరిణామక్రమం, జీవ పరిణామం అన్ని కళ్లకు కట్టినట్లు కనపడటంతో పాఠం సులభంగా అర్థమవుతోంది. ఈ పాఠశాలల్లో ఈ మార్పులు మా భవితకు బాటలు వేస్తాయన్న నమ్మకం ఏర్పడింది.



వైవిధ్యం

స్మార్ట్ పాఠం.. ఏకాగ్రతకు నేస్తం

- సర్కారు బడుల్లో అర్థవంతంగా బోధన
- దృశ్య, శ్రవణ విధానంలో పాఠ్యాంశాలపై శిక్షణ
- ఈజీగా గుర్తు పెట్టుకుంటున్న విద్యార్థులు
- ఐఎఫ్‌పీ, స్మార్ట్ టీవీల ఏర్పాటుతో సత్ఫలితాలు

కంకిపాడు(పెనమలూరు):సీఎం వైఎస్ జగన్ తీసుకొస్తున్న నూతన విద్యా విధానాలతో ప్రభుత్వ బడుల రూపురేఖలు మారుతున్నాయి. కార్పొరేట్‌కు దీటుగా పాఠశాలలే కాకుండా విద్యార్థులను కూడా తీర్చిదిద్దే దిశగా సర్కారు అడుగులు వేస్తుంది. పోటీ ప్రపంచంలో తెలుగు విద్యార్థులు వెనకబడకుండా ఉండేలా విద్యా ప్రమాణాలను పెంపొందిస్తుంది. కృష్ణాజిల్లా వ్యాప్తంగా 1,109 ప్రాథమిక పాఠశాలలు, 274 ప్రాథమికోన్నత పాఠశాలలు, 414 జెడ్పీ పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా విద్యాశాఖ ప్రభుత్వ బడుల రూపురేఖలు, విద్యాప్రమాణాలను పటిష్టంగా మార్పు చేస్తూ విద్యార్థుల ఉన్నతికి కృషి జరుపుతోంది.

డిజిటల్ బోధన దిశగా..

డిజిటల్ తరగతి గదులు గతంలో పాఠశాలకు ఒకటి మాత్రమే ఉండేది. అది కూడా జెడ్పీ పాఠశాలల్లోనే. అయితే అవి పూర్తి స్థాయిలో వినియోగించిన దాఖలాలు లేవు. విద్యార్థులు పూర్తి స్థాయిలో పాఠ్యాంశాలను వింటూ, చూస్తూ నేర్చుకునేలా ప్రభుత్వం విద్యాబోధనలో మార్పులు తెచ్చింది. ఇందులో భాగంగానే ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్(ఐఎఫ్‌పీ), స్మార్ట్ టీవీలను పాఠశాలల్లో ఏర్పాటు చేస్తోంది. తొలి దశలో జిల్లాలో 134 పాఠశాలలను ఐఎఫ్‌పీ ప్యానెల్స్ ఏర్పాటుకు ఎంపిక చేసింది. ఆయా పాఠశాలల్లో ఉన్న 729 తరగతి గదులకు ఐఎఫ్‌పీ ప్యానెల్స్‌ను అందించింది. ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్ పాఠాల బోధనకు 180 పాఠశాలలను ఎంపిక చేసింది. వీటిలో 257 తరగతి గదుల్లో స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంది. ఇప్పటికే ఆయా ఐఎఫ్‌పీ ప్యానెల్స్, స్మార్ట్ టీవీలు పాఠశాలలకు చేరుకోవటమే కాకుండా స్మార్ట్, డిజిటల్ బోధన పటిష్టంగా జరుగుతుంది.

ఉపాధ్యాయులకు శిక్షణ..

ముఖ్యంగా ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్‌పై విద్యార్థులకు పాఠాలను బోధించేందుకు ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. గత నెలలో 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ ప్రత్యేక శిక్షణ అందించారు. బోధనలో సులభతరంగా, అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించే విధానంపై నిష్ణాతులను చేశారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని విద్యార్థుల విద్యా ప్రమాణాలను, స్థాయిని పెంపొందించేలా తీసుకోవాల్సిన విద్యా విషయక చర్యలపై సూచనలు అందించారు. ప్రస్తుతం ఐఎఫ్‌పీ ప్యానెల్స్, స్మార్ట్ టీవీల ద్వారా సులభతరంగా, సరళంగా, అర్థమయ్యే రీతిలో బోధన పాఠశాలల్లో సాగుతోంది. విద్యార్థులకు అవసరమైన బొమ్మలు, వీడియోలు, మెటీరియల్స్‌ను ప్యానెల్స్ ద్వారా వీక్షిస్తున్నారు.

బోధన తీరులో మార్పు వచ్చింది



ఐఎఫ్‌పీ ప్యానెల్స్ ఏర్పాటుతో బోధనతీరులో మార్పు వచ్చింది. పాఠం వివరించటానికి, దృశ్యరూపకంగా చెప్పటం, బొమ్మలు వివరించటం ద్వారా విద్యార్థులకు అర్థమవుతుంది. ఆసక్తిగా వింటున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ చదువులో రాణించాలి. ఇందుకు విద్యా విధానంలో మార్పులు దోహదపడుతున్నాయి.

– కేవీకే గోపాల్, ఉపాధ్యాయుడు, పునాదిపాడు జెడ్పీ పాఠశాల

బోధన, అభ్యసన సామర్థ్యాల వృద్ధి



విద్యా విధానంలో తీసుకొచ్చిన మార్పులు విద్యా ప్రమాణాల ఉన్నతికి దోహదపడుతున్నాయి. ఇప్పటికే జిల్లాలోని వివిధ పాఠశాలలను సందర్శించి ఐఎఫ్‌పీ, స్మార్ట్ టీవీల వినియోగం పరిశీలించాం. సమర్థంగా సాగుతోంది. ప్రతి ఒక్కరూ వీటిని వినియోగిస్తూ బోధన సాగించాల్సిందే. నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

– తాహెరా సుల్తానా, డీఈఓ, కృష్ణా జిల్లా

కవయిత్రి శైలజకు సత్కారం

కంకిపాడు: సాహితీ ప్రపంచంలో విశిష్ట సేవలు అందిస్తున్న కవయిత్రి శైలజకు అరుదైన సత్కారం లభించింది. నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం రాష్ట్ర 6వ వార్షికోత్సవ సభ, శతాధిక కవయిత్రుల కవితోత్సవం, వనితావనం ఈ నెల 12న విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ వార్షికోత్సవ సభలో కంకిపాడుకు చెందిన కవయిత్రి శైలజను ఘనంగా సత్కరించి అభినందించారు. ఉత్తమ రచనలను సమాజానికి అందించేందుకు కృషి చేస్తానని కవయిత్రి శైలజ అన్నారు.

తల్లిపై దాడి చేసిన కుమార్తె పై కేసు

పెనమలూరు: తల్లిపై దాడి చేసిన కుమార్తె పై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. సీఐ ఎం.కిషోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి శ్రీనివాసానగర్‌లో కిలారు సౌభాగ్యలక్ష్మి ఉంటుంది. ఆమె కుమార్తె ఆర్.విజయశ్రీకి ఆస్తి తగాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో శనివారం తల్లి సౌభాగ్యలక్ష్మి ఇంటికి కుమార్తె విజయశ్రీ వచ్చి ఆమెతో తగాదాపడి దౌర్జన్యం చేసి దాడి చేసింది. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

నేడు ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వేడుకలు

కంకిపాడు: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వేడుకలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ టి.ఉదయ్‌భాస్కర్ తెలిపారు. సోమవారం కంకిపాడు, ప్రొద్దుటూరు, తెన్నేరు, గొడవర్రు, కాసరనేనివారిపాలెం గ్రామాల్లో నా భూమి–నాదేశం వేడుకలు జరుగుతాయన్నారు. ఆయా గ్రామాల్లో నిర్వహించే కార్యక్రమాల్లో మండల అధికారులు పాల్గొంటారన్నారు. ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

2న సీతారామస్వామి ఆలయ భూమికి వేలం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు శ్రీ సీతారామస్వామి ఆలయానికి చెందిన భూమికి ఈనెల 21వ తేదీ గవర్నర్‌పేటలోని దేవదాయశాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో ఉదయం 11గంటలకు టెండర్ కం బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి. లోకేశ్వరి ఆదివారం తెలిపారు. లోకేశ్వరి మాట్లాడుతూ గ్రామంలోని ఆర్‌ఎస్ నెంబరు 186లోని దక్షిణం వైపు ఉన్న 5 బిట్లు (ఒక్కో బిట్టు సుమారు 40 సెంట్లు)కు 11 సంవత్సరాల కాలపరిమితి నిమిత్తం టెండర్ కం బహిరంగ వేలంపాటను దేవదాయశాఖ ఉన్నతాధికారుల సమక్షంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఆలయ అధికారులను సంప్రదించాలని సూచించారు.

'ఆడుదాం ఆంధ్ర'కు నమోదు చేసుకోండి

ఉంగుటూరు: రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఈ నెల14న మండల పరిషత్ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని ఎంపీడీఓశేషగిరిరావు విజ్ఞప్తి చేశారు. స్థానిక విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రలో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, కోకో, బ్యాడ్మింటన్, యోగా, టెన్నీకోట్ ఆటల పోటీలు మండల స్థాయి, జిల్లా, రాష్ట్ర స్థాయిలో జరుగుతాయని వివరించారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ



గన్నవరం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద సిటీ బస్సును లారీ ఢీకొట్టిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. గన్నవరం డిపోకు చెందిన 188 నెంబర్ సిటీ బస్సు ఉదయం 7 గంటలకు కొండపల్లికి బయలుదేరింది. బస్టాండ్ అవుట్‌గేట్ నుంచి బస్సు జాతీయ రహదారిపైకి వెళ్తున్న క్రమంలో విజయవాడ నుంచచి ఏలూరు వైపు వేగంగా వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ వైపు సిటీబస్సు అద్దాలు ధ్వంసమయ్యాయి. ఆ సమయంలో బస్సులో ప్రయాణికుడు ఒక్కరే ఉండడంతో పాటు డ్రైవర్ అప్రమత్తతతో ఎవరికి గాయాలు కాలేదు. ఈ ఘటనతో జాతీయ రహదారిపై కొద్ది సేపటి పాటు ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు అక్కడికి చేరుకుని ప్రమాదానికి గురైన లారీ, బస్సును పక్కకు తప్పించి జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు.

నేడు దేశభక్తి గీతాల పోటీలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా సోమవారం సాయంత్రం 4 గంటలకు గాంధీనగర్, ప్రెస్ క్లబ్‌లో 25 ఏళ్లు దాటిన మహిళలకు దేశభక్తి గీతాల పోటీలు నిర్వహిస్తున్నట్లు జయహో వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు కొల్లా జయశ్రీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 25 నుంచి 80 వయస్సు కలిగిన మహిళలు పోటీల్లో పాల్గొనాలన్నారు. మహిళలు తెలుగు సినిమాల్లోని దేశభక్తి గీతాలు మాత్రమే పాడాలన్నారు. మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ

వరుస సెలవుల నేపథ్యంలో పెరిగిన భక్తుల తాకిడి



ఆదిదంపతుల ఉత్సవ మూర్తులకు శాంతి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి వేచి ఉన్న భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్లను దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలిరావడంతో అలయానికి భక్తుల రద్దీ కొనసాగుతోంది. రెండో శనివారం, ఆదివారంతో పాటు మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో ఇతర ప్రాంతాల నుంచి విచ్చేస్తున్న భక్తుల సంఖ్య అధికంగా కనిపిస్తోంది. వరుస సెలవుల నేపథ్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటకల నుంచి పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి తరలివస్తున్నారు. ఆదివారం తెల్లవారుజాము నుంచే ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ కనిపించింది. ఆది దంపతులను దర్శించుకునేందుకు తరలి వచ్చిన భక్తులతో పాటు ఆర్జిత సేవల్లో పాల్గొనేందుకు సైతం ఉభయదాతలు ఆసక్తిని చూపుతున్నారు. దీంతో ఖడ్గమాలార్చనతో పాటు లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, శాంతి కల్యాణం, చండీ హోమాల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొని తమ నామగోత్రాలతో పూజలు జరిపించుకున్నారు.

లోక కల్యాణార్థం సూర్యోపాసన సేవ....

లోక కల్యాణార్థం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆదివారం సూర్యోపాసన సేవ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద సూర్య భగవానుడి చిత్రపటానికి ఆలయ అర్చకులు పూజలు నిర్వహించారు. సేవలో పాల్గొన్న ఉభయ దాతలు, భక్తులకు ప్రత్యేక క్యూలైన్ ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

క్యూలైన్లను పర్యవేక్షించిన చైర్మన్, ఈఈ...

భక్తుల రద్దీ నేపథ్యంలో అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు క్యూలైన్లను పర్యవేక్షించారు. రూ.100 క్యూలైన్‌లో భక్తులు అధికంగా ఉండటంతో వారికి రూ. 300 క్యూలైన్‌లోకి మళ్లించి రెండు క్యూలైన్ల ద్వారా అమ్మవారిని దర్శించుకునేందుకు అవకాశం కల్పించారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం భక్తులు ఆలయ ప్రాంగణంలో పంపిణీ చేస్తున్న ఉచిత ప్రసాదంతో పాటు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం అమ్మవారికి నిర్వహించిన పంచహారతుల సేవలోనూ ఉభయదాతలు, భక్తులు, పలువురు ప్రముఖులు విశేషంగా పాల్గొన్నారు.

బాలల రక్షణ అందరి బాధ్యత



అవగాహన కల్పిస్తున్న నవజీవన్ బాలభవన్ జోనల్ కో ఆర్డినేటర్ నజ్మా

కృష్ణలంక(విజయవాడతూర్పు): బాలల హక్కుల రక్షణ, వాటిని అమలు పరచడం మనందరి బాధ్యత అని నవజీవన్ బాలభవన్ జోనల్ కో ఆర్డినేటర్ షేక్ నజ్మా అన్నారు. రాణిగారితోటలోని సిమెంట్ గోడౌన్స్‌లో నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో ఆదివారం పారిశుద్ధ్య కార్మికులకు బాలల పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నజ్మా మాట్లాడుతూ.. 18 ఏళ్ల లోపు వయస్సు కలిగిన వారందరూ బాలలేనని, వారి అభిప్రాయాలను గౌరవించి వారి మాటలకు విలువ ఇవ్వాలన్నారు. బాలలను కొట్టడం, తిట్టడం, మానసికంగా వేధించడం వలన మానసికంగా కుంగుబాటుకు గురవుతారని, వారి జీవితంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపిస్తుందని చెప్పారు. మానవ హక్కులన్ని బాలలకు వర్తిస్తాయని, బాలలను పరిరక్షించుకుని వారికి రక్షణగా ఉందామన్నారు. బాలల పట్ల లైంగిక వేధింపులు లాంటి సంఘటనలు జరుగకుండా చూడాలన్నారు. బాల్య వివాహాన్ని ప్రోత్సహించిన తల్లిదండ్రులు, సంరక్షకులకు కూడా శిక్ష పడుతుందని హెచ్చరించారు. విద్యార్థి దశ నుంచి సరైన అవగాహన కల్పించినట్లయితే మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా సమాజంలో మంచి పౌరులుగా ఉంటారన్నారు. మత్తు పదార్థాల వ్యసనం నుంచి డీ ఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకురావచ్చని చెప్పారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

గుణదల మేరీమాత పుణ్యక్షేత్రంలో ప్రార్థనలు



గుణదల కొండపై భక్తులు

గుణదల(విజయవాడ తూర్పు): గుణదల మేరీమాత పుణ్యక్షేత్రంలో ఆదివారం భక్తుల రద్దీ కొనసాగింది. పుణ్యక్షేత్ర ప్రధానాలయంలో ఆదివారం ఉదయం సమష్టి దివ్యబలి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి గుణదల మేరీమాత పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దేవుని పట్ల విశ్వాసం కలిగి, ఆయన కృపకు పాత్రులుగా జీవించాలన్నారు. భక్తులు దైనందిన జీవితంలో పాపానికి తావివ్వకుండా సన్మార్గంలో నడుచుకోవాలని సూచించారు. అనుదినం బైబిల్ పఠనం, ప్రార్థనా విజ్ఞాపనల ద్వారా దేవుని ఆరాధించాలని పేర్కొన్నారు. చెడుకు దూరంగా ఉంటూ మంచి నడవడికతో ముందుకు సాగాలన్నారు. లోక రక్షకుడైన క్రీస్తు సమస్త మానవాళిని పరిరక్షించేందుకు శిలువ మరణం పొందారని వివరించారు. ఆయన త్యాగాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని సూచించారు. దేవునికి విధేయులుగా నడుచుకోవడం ద్వారా సకల ఆశీర్వాదాలు లభిస్తాయని పేర్కొన్నారు. అనంతరం సమష్టి దివ్యబలి పూజ సమర్పించి భక్తులకు సత్ప్రసాదాన్ని అందజేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పుణ్యక్షేత్రానికి చేరుకుని, మరియమాతను దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు గురువులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

వైఎస్సార్ సీపీ నేత తవ్వా మూర్తికి నివాళి



తవ్వా మూర్తి కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే వల్లభనేని వంశీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: వైఎస్సార్ సీపీ సినీయర్ నేత, మాజీ సర్పంచ్ తవ్వా హేమేశ్వర నరసింహ మూర్తికి అశ్రునయనాలతో తుదివీడ్కోలు పలికారు. ఆయన హఠన్మరణంతో బాపులపాడు మండలం పెరికీడులో ఆదివారం విషాదఛాయలు అలముకున్నాయి. ఆయన భౌతికకాయాన్ని గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్, ఏపీ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కనుమూరి సుబ్బరాజు, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత డాక్టర్ దుట్టా రామచంద్రరావు, లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ పుట్టగుంట సతీష్‌కుమార్, ఏపీ నాటక అకాడమీ నక్కా గాంధీ, పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కైలే జ్ఞానమణి, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆవిర్నేని శేషగిరిరావు, జనసేన నేత చలమలశెట్టి రమేష్, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వెలగపల్లి ప్రదీప్, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని తదితరులు సంతాపం తెలిపారు.

ఉత్సాహంగా జాబ్ ఓరియెంటెడ్ సెమినార్



సెమినార్‌లో మాట్లాడుతున్న పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ అన్నపురెడ్డి కోటిరెడ్డి

కంకిపాడు: జాబ్ ఓరియెంటెడ్ సెమినార్ ఉత్సాహంగా ముగిసింది. లయన్స్ క్లబ్‌ఆఫ్ కంకిపాడు ఆధ్వర్యంలో కంకిపాడులోని శ్రీ కృష్ణ కల్యాణ మండపంలో జాబ్ ఓరియెంటెడ్ సెమినార్ ఆదివారం నిర్వహించారు. 100 మంది విద్యార్థులకు బుక్‌లెట్స్, పరీక్ష అట్ట, పెన్ను అందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరీ యర్రంశెట్టి గాంధీ, జిల్లా పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ అన్నపురెడ్డి కోటిరెడ్డి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో కంకిపాడు అధ్యక్షుడు కంకిపాటి నాగమల్లేశ్వరరావు, మద్దుల గోవిందరావు, అంబుల గోపిరాజా, కోమటి భారతి, మేకల పార్వతీశ్వరరావు, మిరియాల బాబ్జీ, కెవిఎస్ఆర్ ప్రసాద్, మద్దుల నాగపోతురాజు, ఎం. విష్ణు, ఎన్.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అవయవదానంపై సామాజిక చైతన్యం



అవయవదానంపై అవగాహన కల్పిస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ప్రతినిధులు

ఉయ్యూరు: రక్తదానం, అవయవదానం ప్రతి ఒక్కరి నినాదం కావాలని ఐఎంఏ ఉయ్యూరు మాజీ అధ్యక్షుడు డాక్టర్ డి.జితేంద్రబాబు అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో ప్రపంచ అవయవదాన దినోత్సవాన్ని ఉయ్యూరులో ఆదివారం నిర్వహించారు. అవయవ దానంపై అవగాహన కల్పిస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ చేసి ప్రజల్లో చైతన్యం నింపారు. విశ్రాంత ఉద్యోగి కె.యానాదిరావు అవయవదానానికి ముందుకు వచ్చి లయన్స్ క్లబ్ సమక్షంలో అంగీకారపత్రాన్ని అందించారు. దీంతో క్లబ్ ప్రతినిధులు ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ దండమూడి ధీరజ్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు నూకల వెంకట సాంబశివరావు, ఎండీ ఇస్మాయిల్, రామ సత్యకిషోర్, నల్లా శ్రీనివాసరావు, ఊర కిషోర్, వెంట్రప్రగడ బాబ్జీ పాల్గొన్నారు.

ఆకునూరులో ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న అను ఆసుపత్రి వైద్యులు

ఉయ్యూరు: మండలంలోని ఆకునూరు గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మైగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి గారపాటి నాని ఆధ్వర్యంలో అను మై బేబీ ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. శిబిరంలో డాక్టర్ లంక శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించారు. కార్యక్రమంలో మెరుగుమాల ఏసుబాబు, ఆరేపల్లి శ్రీను, గుర్విందపల్లి కార్తీక్, నాగిపోగు ప్రేమ్‌కుమార్, ఎస్ఎస్ బ్రదర్స్ పాల్గొన్నారు.

సంగమంలో వ్యూహం షూటింగ్ సందడి



గోదావరి పుష్కరాల తొక్కిసలాటలో మహిళ మృతి చెందిన సన్నివేశం

ఇబ్రహీంపట్నం: సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ నిర్మిస్తున్న వ్యూహం చిత్రం షూటింగ్ స్థానిక పవిత్ర సంగమం వద్ద ఆదివారం జరిగింది. చంద్రబాబు పాత్రదారుడు ధనుంజయ ప్రభుతో పాటు పలువురు జూనియర్ ఆర్టిస్టులు షూటింగ్‌లో సందడి చేశారు. గోదావరి పుష్కరాల్లో చంద్రబాబు ప్రసంగంతో భక్తులు నిరీక్షించి తొక్కిసలాటలో మృతి చెందిన సంఘటన అసిస్టెంట్ డైరెక్టర్ చిత్రీకరించారు. మొత్తం రుణ మాఫీ చేసి నిరూపిస్తా, ఉచిత విద్యుత్ అమలుచేస్తే కరెంట్ తీగలపైన బట్టలు ఆరేసుకోవాల్సిందే అని అప్పట్లో నోరు జారానని ధనుంజయప్రభు ప్రసగం చిత్రీకరించారు. మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పార్టీ నాయకులతో కలసి సంగమం వద్దకు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. పట్టిసీమ ప్రాజెక్ట్ నిర్మాణంలో చంద్రబాబు కష్టాన్ని కూడా చిత్రీకరించాలని డిమాండ్ చేశారు.